
సాక్షి పల్నాడు
మంగళవారం । 8 । ఏప్రిల్ । 2025



వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం


అచ్చంపేట: స్థానిక సీతారామస్వామివారి దేవాలయం వద్ద సోమవారం శ్రీరామపట్టాభిషేక మహోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 516.30 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 2,053 క్యూసెక్కులు విడుదలవుతోంది.

సింహ వాహనంపై లక్ష్మీనరసింహస్వామి



నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం శ్రీరాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామి వారిని సోమవారం సింహ వాహనంపై పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఇంటర్ అడ్మిషన్లు చేపట్టండి

నరసరావుపేట ఈస్ట్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్యాలలో పనిచేస్తున్న ఇంటర్మీడియెట్ కళాశాలల్లో మొదటి సంవత్సరం ప్రవేశాలను చేపట్టాలని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి ఎం.నీలావతిదేవి సోమవారం తెలిపారు. ఈమేరకు ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు తెలియచేసినట్టు వివరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, గురుకుల కళాశాలలతోపాటు మోడల్ స్కూళ్లు, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు, గిరిజన సంక్షేమ కళాశాలలు తదితర ప్రభుత్వ యాజమాన్య కళాశాలల్లో ఇంటర్మీడియెట్ విద్యార్థుల ప్రవేశాలను పెంచేలా ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు అందిస్తున్న ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, మధ్యాహ్న భోజనం వంటి సంక్షేమ పథకాలను విద్యార్థుల దృష్టికి తీసుకవెళ్లాలన్నారు. ఇప్పటికే ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేపట్టినట్టు వివరించారు. కాగా, ఇంటర్ ఫలితాలను రెండవ వారంలో విడుదల చేసేందుకు బోర్డు కసరత్తు చేస్తుందని తెలిపారు.

ముప్పాళ్లలో భారీ వర్షం

ముప్పాళ్ళ: ముప్పాళ్లలో సోమవారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమవడంతో పాటు ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండవేడితో అల్లాడిన ప్రజలకు కొంత ఉపశమనం లభించినప్పటికీ ఈదురుగాలులతో రైతులు ఇబ్బందులు పడ్డారు. కళ్లాల్లో ఉన్న మొక్కజొన్న, మిరప, పసుపు పంట దిగుబడులు తడవకుండా కాపాడుకునేందుకు పట్టలు కప్పేందుకు పరుగులు పెట్టారు. ఇప్పటికే పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్నామని, తడిస్తే కొనేవారు ఉండరని రైతులు ఆందోళన చెందుతున్నారు.

గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా సాయి కల్యాణ చక్రవర్తి




గుంటూరు లీగల్: గుంటూరు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బి.సాయి కల్యాణ్ చక్రవర్తి నియమితులయ్యారు. రాష్ట్రంలో వివిధ కోర్టుల్లో న్యాయమూర్తులుగా పనిచేస్తున్న కొందరికి పదోన్నతి, మరికొందరికి స్థానచలనం కల్పిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న బి సాయి కల్యాణ్ చక్రవర్తిని గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. ప్రస్తుతం గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న వై.వి.ఎస్.బి.జి.పార్థసారథిని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా నియమించారు.

గుంటూరు నగరంలో పర్యటించిన ఐజీ

పట్నంబజారు: గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి సోమవారం గుటూరు ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని పాతగుంటూరు పోలీసు స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఇటీవల కాలంలో ఆనందపేటలో జరిగిన వృద్ధురాలు పఠాన్ ఖాజాబీ హత్య, ఆమె కుటుంబ సభ్యులపై జరిగిన దాడి నేపథ్యంలో సంబంధిత కేసు వివరాలు అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. పూర్తి స్థాయిలో కేసుకు సంబంధించి దర్యాప్తు చేపట్టాలని, నిందితులను త్వరితగతిన అదుపులోకి తీసుకోవాలని స్టేషన్ అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. అనంతరం ఆనందపేట 2వలైనులో హత్య జరిగిన ప్రాంతాన్ని కూడా ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పరిశీలించారు. ఐజీ వెంట ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సీతారామయ్య, పాతగుంటూరు పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ వై.వీరసోమయ్య తదితరులు ఉన్నారు.

యార్డుకు 1,53,787 మిర్చి బస్తాలు



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,53,787 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,37,288 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.6,300 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 64,276 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

రియల్..ఢమాల్

కూటమి ప్రభుత్వంలో కుప్పకూలిన రియల్ ఎస్టేట్

- కొత్త ప్రభుత్వంలో నూతన వెంచర్ల జోలికి వెళ్లని వ్యాపారులు
- పాత వెంచర్లకు కప్పం కట్టాలంటున్న కూటమి నేతలు
- రిజిస్ట్రేషన్ వేల్యూ పెంపు, చార్జీల మోతతో వెనుకడుగు వేస్తున్న రియల్టర్లు, ప్రజలు
- జిల్లాలో 60 శాతం కూడా సమకూరని రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం
- రూ.664.18 కోట్ల లక్ష్యానికి వచ్చింది రూ.396.98 కోట్లే
- నరసరావుపేట, పిడుగురాళ్లలో సగానికి పైగా పడిపోయిన రిజిస్ట్రేషన్లు



రియల్ ఎస్టేట్ వెంచర్

సాక్షి, నరసరావుపేట, నరసరావుపేట టౌన్: జిల్లాలో రియల్ ఎస్టేట్ రంగం కష్టాల్లో కూరుకుపోయింది. కొత్త ప్రభుత్వ ఏర్పాటు తర్వాత ఈ రంగం పూర్తిగా చితికలపడింది. కొనుగోలు, అమ్మకాలు భారీగా తగ్గిపోయి, మార్కెట్ పూర్తిగా నిలిచిపోయింది. ప్రభుత్వ మార్పు తర్వాత రియల్ ఎస్టేట్‌లో భారీ ఊపు వస్తుందని కూటమి నేతలు చేసిన అభూతకల్పన వీగిపోయింది. వారి మాటలు నమ్మి వ్యాపారాలు బాగుంటాయని భావించిన ఇన్వెస్టర్లు, డెవలపర్లు ఇప్పుడు తీవ్ర నిరాశలో మునిగిపోయారు. కొత్త ప్రాజెక్టులు ఆగిపోయాయి, ఖరీదైన ప్లాట్లు, ఇళ్ల కొనుగోలు చేయాలనే ఆసక్తి కనపడటం లేదు. ఉన్న వెంచర్లలో డెవలప్ చేసిన స్థలాలను సైతం అమ్ముకోలేని దుస్థితి నెలకొంది.

60 శాతం కూడా సమకూరని ఆదాయం...

రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం 2024–25 ఆర్థిక సంవత్సరంలో గణనీయంగా పడిపోయింది. భూముల విలువ, రిజిస్ట్రేషన్ చార్జీలను కూటమి ప్రభుత్వం ఇబ్బడిముబ్బడిగా పెంచడంతో పాటు కూటమి పార్టీల నేతల భూ ఆక్రమణలు, బెదిరింపుల నేపథ్యంలో స్థిరాస్తుల క్రయ విక్రయాలు మందగించాయని అధికారిక లెక్కల ద్వారా తేటతెల్లమవుతోంది. జిల్లాలోని ప్రజాప్రతినిధులు కప్పం కట్టనిదే నూతన వెంచర్లకు అనుమతులు ఇప్పించకపోవడంతో రియల్టర్లు ముందుకు రావడం లేదు. మరోవైపు గతంలో వేసిన వాటికి సైతం బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇది ఇలా ఉండగా రెవెన్యూ కార్యాలయాల్లో కన్వర్షన్లు చేయించుకునేందుకు పెద్ద మొత్తంలో నగదు ముట్టజెప్పాల్సి వస్తోంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను పల్నాడు జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయ లక్ష్యం రూ.664.18 కోట్లు కాగా కేవలం రూ.396.98 కోట్లు మాత్రమే సమకూరింది. లక్ష్యంలో కేవలం 60 శాతం మాత్రమే వచ్చిందంటే జిల్లాలో రియల్ ఎస్టేట్ ఏవిధంగా పడిపోయిందో జరిగిందో అర్థం చేసుకోవచ్చు. అదే విధంగా ఆదాయ పరంగా మొదటి వరుసలో ఉండే పలు రిజిస్ట్రేషన్ కార్యాలయాలు వెనుకబడ్డాయి. నరసరావుపేట, పిడుగురాళ్ల, చిలకలూరిపేట, వినుకొండ లాంటి చోట్ల దాదాపు సగం లక్ష్యమే సాధించింది. మరోవైపు గత సంవత్సరంతో పోల్చి చూస్తే భూమి విలువ పెరిగిన కారణంగా రిజిస్ట్రేషన్ శాఖకు ఆదాయం వచ్చింది తప్ప క్రయ విక్రయాలు చాలా తగ్గుముఖం పట్టాయి. అభివృద్ధి చెందుతున్న ఈ పట్టణాల్లోనే భూముల కొనుగోలుకు ఆసక్తి చూపకపోవడమే దీనికి ప్రధాన కారణం.



నరసరావుపేటలోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం	2024–25 లక్ష్యం (రూ.కోట్లు)	వచ్చిన ఆదాయం (రూ.కోట్లు)
నరసరావుపేట	239.64	128.17
వినుకొండ	76.02	45.15
సత్తెనపల్లి	53.56	32
పెదకూరపాడు	12.54	9.40
పిడుగురాళ్ల	62.65	37.62
మాచర్ల	35.70	17.29
క్రోసూరు	22.99	14.42
గురజాల	44.72	27.66
అమరావతి	27.54	26.75
చిలకలూరిపేట	88.76	58.46

ఆర్థిక సంవత్సరం	లక్ష్యం (రూ.కోట్లు)	వచ్చిన ఆదాయం (రూ.కోట్లు)
2023–24	616.33	472.38
2024–25	664.18	396.98

కొత్త వెంచర్ల ఊసేది?

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట విద్యా, వాణిజ్య, ఆరోగ్య కేంద్రంగా పేరొందింది. అటువంటి నరసరావుపేటలో గత ప్రభుత్వం హయాంలో రియల్ ఎస్టేట్ ఓ వెలుగు వెలిగింది. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో నూతన వెంచర్లు ఏర్పాటు, అపార్ట్‌మెంట్ల నిర్మాణం, బ్రోచర్ల ఆవిష్కరణలతో రియల్ ఎస్టేట్ మార్కెట్ సందడిగా ఉండేది. గడిచిన 10 నెలల్లో ఒక్క కొత్త వెంచర్ కూడా రాలేదు. భూములు కొని ప్లాట్‌లు వేద్దామన్న ఇన్వెస్టర్లే లేరు. అంతెందుకూ గతంలో వెంచర్లలలో కట్టిన ఇళ్ల కొనుగోళ్లు కూడా నిలిచిపోయాయి. నరసరావుపేట పట్టణ, శివారు పరిధిలో ఏటా అపార్ట్‌మెంట్లలో వందల సంఖ్యలో ప్లాట్ల అమ్మకాలు జరిగేవి. కానీ గడిచిన పది నెలల్లో కనీసం 50 ప్లాట్లు కూడా అమ్ముడుపోలేదు. దీంతో పాటు జిల్లాలో ఇతర పట్టణాల్లో కూడా స్థిరాస్తి క్రయవిక్రయాలు మరింత దిగజారినట్టు రియల్‌ఎస్టేట్ ప్రముఖులు చెప్పుకొస్తున్నారు.

రియల్ ఎస్టేట్ పూర్తిగా దెబ్బతినింది



నరసరావుపేటలో రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా దెబ్బతింది. గత పది నెలలుగా కొత్త వెంచర్లు లేవు, స్థలాలు కొనుగోలుచేసేవారు లేరు. అదేవిధంగా అపార్ట్‌మెంట్లు అడిగేవారు కరువయ్యారు. ఇటువంటి పరిస్థితి మునుపెప్పుడు చూడలేదు. నరసరావుపేటలో ఇటువంటి పరిస్థితి ఊహించలేదు. అప్పులు చేసి వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టిన వారు వడ్డీలు చెల్లించలేక ఆర్థికంగా నష్టపోతున్నారు.

– అంబవరపు వెంకటేశ్వరరెడ్డి, ఏవీఆర్ కన్‌స్ట్రక్షన్స్ నిర్వాహకుడు, నరసరావుపేట

వెంచర్లు చూసేందుకూ రావడం లేదు



గత కొన్ని నెలలుగా రియల్‌ఎస్టేట్ మందగించడంతో క్రయ విక్రయాలు లేక మీడియేటర్ల పరిస్థితి దారుణంగా తయారైంది. వెంచర్లు చూడటానికి కూడా కొనుగోలుదారులు రావడం లేదు. రియల్ ఎస్టేట్ పడిపోవడం వల్ల మాతో పాటు ఈ రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి ఉన్న ఎన్నో కుటుంబాలు రోడ్డునపడుతున్నాయి.

– షేక్ బాజీ, రియల్‌ఎస్టేట్ మీడియేటర్, నరసరావుపేట

రిజిస్ట్రేషన్లు బాగా తగ్గాయి

జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు రిజిస్ట్రేషన్లు బాగా తగ్గాయి. కొత్త వెంచర్లు పెద్దగా వేయకపోవడంతో ఆదాయం గణనీయం తగ్గుముఖం పట్టింది. ఆదాయం గణనీయంగా ఉండే నరసరావుపేట, పిడుగురాళ్లలో వ్యాపారాలు మందగించడం శాఖ ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపింది. గత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో పరిస్థితి కొంత మెరుగవడంతో ఆదాయం సమకూరింది.

– రాంకుమార్, జిల్లా రిజిస్ట్రార్

అర్జీలకు సత్వర పరిష్కారం

- జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- పీజీఆర్‌ఎస్‌లో 300 అర్జీలు స్వీకరణ

చిలకలూరిపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు చెప్పారు. పట్టణంలోని ప్రత్తిపాటి గార్డెన్స్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనంజయ్ వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. వివిధ సమస్యలకు సంబంధించి వచ్చిన 300 అర్జీలను స్వీకరించారు.



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

దేవాలయ మాన్యం ఆక్రమించారు



అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామంలో నివాసం ఉండే గుర్రం ఇంటిపేరు కలవారి కుల దేవత రేణుకమ్మతల్లి గుడికి మా పూర్వీకులు 12.5 ఎకరాల భూమి ఇచ్చారు. దేవాలయ నిర్వహణ కోసం ఈ భూమిపై వచ్చే ఆదాయం ఉపయోగిస్తాం. ఇదే గ్రామానికి చెందిన ఒకరు ఈ భూమిలో 1.59 ఎకరాలు ఆక్రమించి పట్టా పుట్టించుకున్నాడు. ఈ విషయమై పూర్తి విచారణచేసి ఆక్రమణకు గురైన భూమిని దేవాలయానికి అప్పగించాలి.

– గుర్రం ఉపేంద్ర, గుర్రం సత్యనారాయణ, అమీన్‌సాహెబ్‌పాలెం

న్యాయమైన పరిహారం ఇప్పించాలి



చీరాల వాడరేవు నుంచి నకరికల్లుకు రోడ్డు వేస్తున్నారు. ఇందులో మా కుటుంబానికి సంబంధించి ఐదు ఎకరాల భూమిని రోడ్డు నిర్మాణానికి తీసుకున్నారు. బొప్పూడి వద్ద రోడ్డుకు పడమట ఉన్న పొలం ఎకరాకు రూ.1.30కోట్ల చొప్పున పరిహారం చెల్లించారు. తూర్పు వైపు పొలానికి ఎకరాకు కేవలం రూ. 33లక్షలు మాత్రమే ఇచ్చారు. ఇది అన్యాయమని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతునే ఉన్నాం. మాకు న్యాయం చేయాలి.

– షేక్ అమీర్‌జానీ, బొప్పూడి

ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం



ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి కొర్రపాటి ఆదినారాయణ అనే వ్యక్తి నా వద్ద నుంచి రూ.2లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేశాడు. పెద్ద మనషులతో అనేక పర్యాయాలు అడగ్గా రూ.1.20 లక్షలు చెల్లించాడు. ఇంకా రూ. 80 వేలు చెల్లించాల్సి ఉంది. ఇదే విషయాన్ని ఇప్పటికే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశాను. నాకు న్యాయం చేయాలి.

– గాలం సదాశివ బ్రహ్మం, చిలకలూరిపేట

శ్మశానం అభివృద్ధి చేయాలి



పట్టణంలోని శారదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో 2.62 ఎకరాల్లో హిందూ, క్రైస్తవులకు కలిపి ఉమ్మడిగా శ్మశానవాటిక ఉంది. ఇందులో ఇప్పటికే 62 సెంట్లు ఆక్రమణలకు గురైంది. మిగిలిన రెండు ఎకరాల్లో ఒక ఎకరంలో హిందువులు, మరో ఎకరంలో క్రైస్తవులు ఉపయోగించుకుంటున్నారు. దీనిని అధికారికంగా రెండు వర్గాల వారికి పంచిపెడితే అభివృద్ధి చేసుకొనే అవకాశం ఉంటుంది.

– కందా భాస్కరరావు, చిలకలూరిపేట

పెంచుకున్న వాడే మోసం చేశాడు



ఎవరూ లేని అనాథ అని చెప్పి నక్కా వెంకటేశ్వరరావును పెంచి పెద్ద చేశాం. ఇల్లు కూడా కట్టించి ఇచ్చి వివాహం చేశాం. క్రికెట్ బెట్టింగులకు అలవాటు పడి ఆస్తి మొత్తం పోగొట్టాడు. వాడి పిల్లవాడికి ఆరోగ్యం బాగాలేదని నా వద్దకు వచ్చి బాధపడితే ఆరు సవర్ల బంగారు గాజులు తాకట్టుపెట్టి డబ్బులు ఇచ్చాను. ఇప్పుడు అడిగితే ఇవ్వను ఏం చేసుకుంటావో చేసుకో అంటున్నాడు. వృద్ధురాలిలైన నేను పక్షవాతంతో బాధపడుతున్నాను. అధికారులు నాకు న్యాయం చేయాలి.

– నగరి లక్ష్మి, చిలకలూరిపేట

ఉత్తమ ప్రదర్శన నాన్న నేనొొచ్చేస్తా

- ముగిసిన జాతీయస్థాయి నాటికల పోటీలు
- ఈనెల 4వ తేదీ నుంచి 6వరకు పది నాటికలు ప్రదర్శన



శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ నుంచి ఉత్తమ ప్రదర్శన బహుమతి అందుకుంటున్న 'నాన్న నేనొొచ్చేస్తా' బృందం

యడ్లపాడు: వుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం నిర్వహించిన 22వ జాతీయస్థాయి నాటికల పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. కళానిలయం అధ్యక్షుడు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు ఆధ్వర్యంలో స్థానిక ఎంవీ చౌదరి కళావేదిక ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు 10 నాటికలు ప్రదర్శించారు. ప్రతిరోజూ పండుగలా నిర్వహించిన ఈ పోటీలకు ప్రేక్షకులు భారీగా తరలివచ్చారు. కళాభిమానులు మూడు రోజులు అర్థరాత్రి వరకు ఉంటూ కళారూపాల్ని ఆద్యంతం తిలకించి ఆస్వాదించారు. నిత్యం ప్రేక్షకులకు వెయ్యి మందికి అల్పాహారం అందించడం, ప్రతిరోజూ 30 మంది చొప్పున 90 మందికి లక్కీడ్రా తీసి బహుమతుల్ని అందించారు. 15 మంది న్యాయనిర్ణేతలు, దాతలు, కళాకారులు, అతిథులు పలు రంగాలకు చెందిన ప్రముఖులకు జ్ఞాపికలు అందించి సత్కరించారు. ముత్తవరపు సురేష్‌బాబు సతీమణి ముత్తవరపు అరుణకుమారి లేడీ ఆర్టిస్టులను ఆడపడుచు లాంఛనాలిచ్చి సత్కరించారు.

▪ జాతీయస్థాయి ఆహ్వాన నాటికల పోటీల్లో అమృతలహరి థియేటర్ (గుంటూరు)వారి ''నాన్న నేనొొచ్చేస్తా'' ఉత్తమ ప్రదర్శనగా ఎంపికై ంది. ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా యువభేరి థియేటర్స్(హైదరాబాద్) వారి 'నా శత్రువు' నాటిక, ఉత్తమ తృతీయ ప్రదర్శనగా శ్రీసాయి ఆర్ట్స్(కొలకలూరి) వారి 'జనరల్ బోగీలు' నాటిక నిలిచాయి.

వ్యక్తిగత అవార్డులు

ఉత్తమ రచయిత తాకాబత్తుని వెంకటేశ్వరరావు, ఉత్తమ దర్శకులు అమృత, లహరి, ఉత్తమ ఆహార్యం (నాన్న నేనొొచ్చేస్తా), ఉత్తమ సంగీత దర్శకులు (నా శత్రువు), ఉత్తమ రంగాలంకరణ (చిరుగు మేఘం), ఉత్తమ నటీనటులు..సోమిశెట్టి అమృతవర్షిణి(నాన్న నేనొొచ్చేస్తా), కావూరి సత్యనారాయణ(చిగురు మేఘం), సురభి ప్రభావతి(జనరల్ బోగీలు), గంగోత్రి సాయి (విడాకులు కావాలి), జ్యోతిరాణి (నాశత్రువు), ఉత్తమ సహాయనటులు...ఎస్.వెంకటేశ్వర్లు (కిడ్నాప్), వసంత యామిని(విడాకులు కావాలి), నాగరాణి (చిగురు మేఘం), సునయన (నా శత్రువు), వడ్డా సత్యనారాయణ(నా శత్రువు), జ్యూరీ అవార్డ్స్ మాస్టర్ మదన్(కిడ్నాప్), బేబి వర్షిణి (నా శత్రువు)లు అందుకున్నారు. కార్యక్రమంలో నాటక పరిషత్ ఉపాధ్యక్షుడు జరుగుల శంకరరావు, కార్యదర్శి ముత్తవరపు రామారావు, కోశాధికారి నూతలపాటి మాధవరావు, కాళిదాసు, ఎం.పద్మారావు పాల్గొన్నారు.

ప్రాణ సంకటం

- కుక్కల స్వైరవిహారం
- గుంటూరు ప్రజలు బెంబేలు
- గాలిలో పసిప్రాణాలు
- 2017లో కుక్కల దాడిలో ఓ బాలుడి మృతి
- కొద్దినెలల క్రితం బాలికపై దాడి
- తాజా ఘటనలో మరో బాలుడు బలి
- శునకాల బారిన పడుతున్న నగరవాసులు
- జీజీహెచ్‌కు వస్తున్న కేసులు
- చోద్యం చూస్తున్న నగరపాలక సంస్థ అధికారులు



నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రజలపై విరుచుకుపడుతున్నాయి. చిన్నారులు, వృద్ధులు కుక్కకాట్లకు బలవుతున్నారు. అయినా నగర పాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యానికి తాజాగా ఆదివారం స్వర్ణ భారతినగర్‌లో ఇంటి ముందు ఆడుకుంటున్న నాలుగేళ్ల బాలుడు ఐజక్ బలయ్యాడు. కుక్క గొంతుకరుచుకుని తీసుకుపోవడంతో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయాడు. 2017 డిసెంబర్‌లోనూ ఇంటి బయట ఆడుకుంటున్న చిన్నారి కుక్క కరవడంతో చనిపోయాడు. కొద్ది నెలల క్రితం సంపత్‌నగర్‌లో ఓ బాలికపై కుక్క దాడి చేసింది. స్థానికులు కుక్కను తరిమివేయడంతో గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందింది. ఏడేళ్ల క్రితం హుస్సేన్‌నగర్, ఆంజనేయ కాలనీలో 9 మందిపై వీధి కుక్కలు దాడి చేసి కండలు పీకేశాయి. వీరిలో ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారు. గుంటూరులో రోజూ ఏదోచోట కుక్కకాటుకు ప్రజలు బలవుతున్నారు. జీజీహెచ్, ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

జనవరి 9 నుంచి ఆగిపోయిన ఏబీసీ ఆపరేషన్లు

గుంటూరు నగరంలో వీధి కుక్కల నియంత్రణ కోసం నగరపాలక సంస్థ గతంలో చర్యలు చేపట్టింది. ఏటుకూరు రోడ్డులో స్నేహ యానిమల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కుక్కలకు కుటుంబ నియంత్రణ (ఏబీసీ) ఆపరేషన్లు చేయించేది. ఈ ఆపరేషన్లు చేసినందుకు గాను ఒక కుక్కకు రూ.రెండు వేల వరకూ స్నేహ సంస్థకు చెల్లించేంది. అయితే నిబంధనలు పాటించకుండా ఆపరేషన్లు జరుగుతున్నాయని, స్టెరిలైజేషన్ సక్రమంగా ఉండటం లేదని, ఆపరేషన్ ద్వారా కుట్లు కూడా సక్రమంగా వేయడం లేదని, రికార్డ్స్ సక్రమంగా నిర్వహించడం లేదని కొందరు జంతుప్రేమికులు యానిమాల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేశారు. దీంతో గత ఏడాది అక్టోబర్ 18న గుంటూరుకు విచ్చేసిన యానిమల్ బోర్డ్ సభ్యులు స్నేహ సొసైటీ చేస్తున్న ఆపరేషన్లలో లోపాలున్నాయని గుర్తించి ఆపరేషన్లు చేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు. దీంతో జనవరి 9 నుంచి ఏబీసీ ఆపరేషన్లు ఆగిపోయాయి. ఆ తర్వాత మళ్లీ స్నేహ సంస్థ ఏబీసీ ఆపరేషన్లు చేసేందుకు అప్పీలు చేసుకోవడంతో జనవరి 24న యానిమల్ బోర్డ్ సభ్యులు గుంటూరు వచ్చి స్నేహ సంస్థ ఏబీసీ సెంటర్‌ను పరిశీలించారు. ఇంకా ఆపరేషన్ల నిర్వహణలో లోపాలు ఉన్నాయని సభ్యులు తేల్చారు. నగరపాలక సంస్థ తరుపునే ఆపరేషన్ల చేయాలని ఆదేశించారు. దీనికి సంబంధించిన ప్రక్రియను నగరపాలక సంస్థ అధికారులు చేపట్టారు.

ఆపరేషన్లు చేయకుండానే బిల్లులు

అధికారుల లెక్కల ప్రకారం గుంటూరు నగరంలో 31,400 కుక్కలు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. వీటిలో సుమారు 4,500 కుక్కలకు ఏబీసీ ఆపరేషన్లు, యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ వేసినట్లు చెబుతున్నారు. వీటి కోసం రూ.37,48,500 లక్షలు ఖర్చు చేసినట్లు చెబుతున్నారు. అయితే వీటిలో కూడా చాలా కుక్కలకు ఆపరేషన్లు చేయకుండానే చేసినట్లుగా బిల్లులు పెట్టుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొద్ది నెలల క్రితం ఇక్కడ ఇన్‌చార్జ్ ఎంహెచ్‌ఓగా పనిచేసిన ఓ అధికారి ఆధ్వర్యంలో ఏబీసీ ఆపరేషన్ల విషయంలో గోల్‌మాల్ జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి.

ఎరువుల వ్యాపారి ఉడాయింపు

50 మంది దగ్గర రూ.2.50 కోట్లు అప్పులు చేసిన టీడీపీ నేత



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన వ్యక్తం తాళ్లపల్లి గ్రామ రైతులు

మాచర్ల రూరల్: ఫర్టిలైజర్ వ్యాపారి అప్పులు చేసి పరారవడం స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని తాళ్లపల్లి గ్రామానికి చెందిన తెలుగు దేశం పార్టీ నాయకుడు నాళం అమర నాగేశ్వరరావు ఎరువులు, పురుగు మందుల వ్యాపారం చేస్తూ గ్రామంలో సుమారు 50 మందికి పైగా రైతుల వద్ద రూ. 2.50 కోట్ల మేర అప్పులు తీసుకున్నాడు. కొందరి వద్ద పంట కొనుగోలు చేసి, మరికొందరి వద్ద ప్రామిసరీ నోట్లు, స్థలాలు, పొలాలు, అమ్మకం అగ్రిమెంట్లు రాసి నగదు తీసుకొని పరారయ్యాడు. సోమవారం గ్రామానికి చెందిన రైతులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ బి.కిరణ్ కుమార్‌ను వినతి పత్రం అందించారు. తనకు చెందిన పొలం, ఇళ్లు, స్థలాలు విక్రయిస్తానని అగ్రిమెంట్ రాసి రెండు రోజుల నుంచి కనిపించకుండా వెళ్లాడని, ఇంటికి తాళం వేసి సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ కుటుంబ సభ్యులు మొత్తం కన్పించటం లేదని వారు తహసీల్దార్‌కు తెలిపారు. అమర నాగేశ్వరరావుకు చెందిన ఆస్తులను ఇతరులకు అమ్మకుండా వచ్చే నగదును రైతులమైన మాకు చెందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దీని పై స్పందించిన కిరణ్ కుమార్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, రూరల్ పోలీసులను సంప్రదించాలని సూచించారు. దీంతో వారు ఆయా కార్యాలయాలకు వెళ్ళి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందించినట్లు తెలిపారు.

■ ఇదిలా ఉండగా గత ఆరు నెలల కాలంలో సుమారు రూ. 100 కోట్ల వరకు వివిధ వ్యాపారులు ఐపీ నోటీసులు దాఖలు చేయటం మాచర్ల పట్టణంలో సంచలనం రేకెత్తిస్తుంది. అప్పులిచ్చిన వ్యాపారులు, రైతులు ఆందోళన చెందుతున్నారు.

తండ్రి మందలించాడని బాలిక ఆత్మహత్య

నకరికల్లు: తండ్రి మందలించాడనే కోపంతో బాలిక ఆత్మహత్యాయత్నాకి పాల్పడి చికిత్సపొందుతూ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి.. మండలంలోని కుంకలగుంట గ్రామంలోని సుగాలితండాకు చెందిన రమావత్ అనూషబాయి (16) 7వ తరగతి చదువుతూ చదువు సక్రమంగా రావడం లేదని మానేసి పొలంపనులకు వెళ్తుంది. పొలంపనులకు వెళ్లవద్దని కుట్టు మిషన్ పని నేర్చుకోవాలని తండ్రి మందలించినందుకు మార్చి 31న ఎలుకల పేస్టు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు నరసరావుపేటలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్యకోసం మంగళగిరి ఎయిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఈనెల 6వ తేదీన మృతిచెందింది. తండ్రి హనుమా నాయక్ ఫిర్యాదు మేరకు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు.

మూడో కన్ను మసకబారింది!



నకరికల్లు గ్రామంలో పనిచేయని సీసీ కెమెరాలు

- నకరికల్లులో మొరాయించిన సీసీ కెమెరాలు
- 2023లో రూ.4లక్షలు వెచ్చించి 28 కెమెరాలు ఏర్పాటు
- సీసీ కెమెరాల సాయంతో ఎన్నో కేసులు సత్వరమే ఛేదించిన పోలీసులు
- గత కొన్నిరోజులుగా ఏ ఒక్కటీ పనిచేయని వైనం
- ప్రశ్నార్థకంగా మారిన భద్రత

నకరికల్లు: 2023 జూలైలో స్థానిక ఇందిరమ్మకాలనీలోని ఒక ఇంట్లో చోరీ జరిగింది. సుమారు రూ.7లక్షల నగదు, కొంత బంగారం చోరీకి గురైంది. చోరీ కేసు నమోదు చేసిన పోలీసులు వారంరోజుల్లోనే కేసును ఛేదించగలిగారు. సొత్తును రికవరీ చేసి బాధితులకు అప్పగించారు.

- అదే ఏడాది ఆగస్టులో హైవే పక్కన ఉన్న ఏటీఎం ధ్వంసం చేసిన ఘటనలోను నిందితుడిని ఒక్కరోజులోనే పట్టుకోగలిగారు. అంత త్వరగా కేసులు ఛేదించడానికి పోలీసులకు ఉపయోగం పడిన ఆయుధం సీసీ కెమెరా.. ఇలా ఎన్నో కేసులను అతితక్కువ సమయంలో పోలీసులు ఛేదించగలిగారంటే అది కేవలం సీసీ కెమెరాలు అందించిన ఆధారాలే. 2023లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హయాంలో 2023 సంవత్సరంలో నకరికల్లు గ్రామంలోని ప్రధాన కూడళ్లలో, అలాగే అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారి పక్కన సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. రూ.4 లక్షలు వెచ్చించి 28 పెద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గ్రామంలో ఎక్కడ ఏ మూలన ఏం జరిగినా పోలీస్ కంట్రోల్ రూంలో రికార్డయి తెలిసిపోయేది. చోరీలు అరికట్టేందుకు, చోరీ కేసుల్లోని, రోడ్డు ప్రమాదాల్లో నిందితులను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ప్రధాన పాత్ర పోషించాయి. సీసీ కెమెరాలు ఇచ్చిన క్లూ ఆధారంగా ప్రమాదానికి కారణమై తప్పించుకుపోయిన నిందితులను వాహనాలతో సహా గుర్తించారు. ఇలాంటి ఎన్నో ఘటనలకు కారణమైన ఆధారాలను అందించిన సీసీ కెమెరాలు గత కొన్నిరోజులుగా ఏ ఒక్కటీ పనిచేయడం లేదు. దీంతో గ్రామస్తులు మళ్లీ భయం నీడన బతకాల్సి వస్తుంది.

ఒక్కటీ పని చేయడం లేదు..



అలంకారప్రాయంగా అద్దంకి - నార్కెట్‌పల్లి రహదారిపై ఉన్న సీసీ కెమెరా

సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో మళ్లీ ఇటీవల కాలంలో ఘర్షణలు, చోరీలు జరుగుతున్నాయని రోడ్డుపక్కన గృహాల వారు, శివారు ప్రాంతంలో నివాసముంటున్న వారు, దుకాణదారులు వాపోతున్నారు. వేసవి కావడంతో ఎక్కువగా దొంగతనాలు జరుగుతుంటాయి. అందునా సెలవుల కాలంలో ఇళ్లకు తాళాలు వేసి కుటుంబసమేతంగా ప్రజలు ఊళ్లకు, యాత్రలకు వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో ఆస్తుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. అందునా అద్దంకి - నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారి పక్కన గ్రామం కావడంతో చోరీలతో అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఉంటుంది. గతంలో జరిగిన చోరీల నేపథ్యంలో సీసీకెమెరాలు పనిచేయడం లేదన్న సమాచారంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతుకు గురైన సీసీ కెమెరాలు సత్వరమే వినియోగం తేవాలని ప్రజలు కోరుతున్నారు.

సత్వరమే బాగు చేయించాలి



సీసీ కెమెరాలు పనిచేస్తూ ఉన్నప్పుడు గ్రామంలో ఏ చోరీ జరిగినా నిందితులను కొద్దిరోజుల్లోనే పోలీసులు పట్టుకున్న ఘటనలు ఉన్నాయి. మారుమూల ప్రాంతాల్లో ఉన్న ఇళ్లల్లో సైతం చోరీలు జరగకుండా సీసీ కెమెరాల ద్వారా నిలువరించగలిగారు. ఇప్పుడు సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. చోరీల బెడద అధికంగా ఉంటుంది. హైవేపై కూడా నిఘా పెట్టాలి. చోరీలు అరికట్టాలంటే ఉన్న కెమెరాలనే సత్వరమే మరమ్మతు చేయించి వినియోగంలోకి తీసుకురావాలి.

- ఈవూరి లక్ష్మారెడ్డి, నకరికల్లు

భద్రత ప్రశ్నార్థకమే..



ప్రధాన రహదారిపై ఉన్న గ్రామం నకరికల్లు. కొత్తవారు ఎక్కువ మంది రాకపోకలు చేస్తుంటారు. నిత్యం సీసీ కెమెరా నిఘా ఉంటేనే భద్రత ఉంటుంది. వేసవి కావడంతో కాలనీల్లో ఎక్కువ మంది ఆరుబయటే నిద్రపోతారు. అలాంటి సమయంలో చోరీలు జరిగే అవకాశం ఉంటుంది. వాటిని అరికట్టాలంటే తప్పనిసరిగా సీసీ కెమెరాల నిఘా అవసరం.

- గోదా బాల, నకరికల్లు వాసి

సాంకేతిక లోపాలు సరిచేయిస్తున్నాం



సీసీ కెమెరాల నిర్వహణలో చిన్న చిన్న సాంకేతిక లోపాలు తలెత్తాయి. టెక్నీషియన్‌ల సహాయంతో లోపాలను గుర్తించి మరమ్మతులు చేయించి సత్వరమే వినియోగంలోకి తీసుకువస్తాం. శాంతిభద్రతలకు అన్నివిధాల టెక్నికల్‌గా చర్యలు తీసుకుంటాం.

- చల్లా సురేష్, ఎస్ఐ, నకరికల్లు

108 మందికి రెండే మరుగుదొడ్లా?

సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్‌ను పరిశీలించిన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి



నరసరావుపేట: 108 మంది విద్యార్థినులు ఉండే హాస్టల్‌లో రెండే మరుగుదొడ్లు ఉండటం, అవికూడా దుర్గంధం వెదజల్లటంపై రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆమె పట్టణంలోని మొదటి రైల్వే గేటు సమీపంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ కన్పించిన అపరిశుభ్రతను చూసి మండిపడ్డారు. సంబంధిత రెవెన్యూ అధికారులు, సోషల్ వెల్ఫేర్ ప్రస్తుత ఇన్‌చార్జి పిలిపించి వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. తహసీల్దార్ వేణుగోపాలరావు, సీడీపీఓ సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

సేఫ్టీవాల్ నిర్మించాలి

నరసరావుపేట రూరల్: రైల్వేట్రాక్ పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలలో 15రోజుల్లో సేఫ్టీవాల్ నిర్మించి పిల్లల భద్రత చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. లింగంగుంట్ల రాజుపాలెం వాటర్‌ట్యాంక్ పక్కనే ఉన్న ఎంపీపీ స్కూల్‌ను సోమవారం ఆమె సందర్శించి, పాఠశాల రికార్డులను పరిశీలించారు. పాఠశాల మరుగుదొడ్లకు 20 అడుగుల దూరంలోనే రైల్వే ట్రాక్ ఉండటాన్ని గమనించారు. పిల్లలకు ప్రమాదం పొంచి ఉన్నట్టు గుర్తించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి సేఫ్టీవాల్ నిర్మించాలని ఆదేశించారు.

ఆరోగ్యశ్రీ ట్రస్టు ప్రైవేటీకరణ మానుకోవాలి

- పేదలకు ఆరోగ్యశ్రీ సేవలు అందకుండా చేసేందుకు కూటమి కుట్ర
- ఇప్పటివరకు రూ.3,500 కోట్ల బకాయిలు
- బీమా కంపెనీలకు ఏడాదికి రూ.7500 కోట్లు ముందుగా చెల్లిస్తామనటంలో మర్మమేంటి?
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్



మాట్లాడుతున్న డాక్టర్ అశోక్‌కుమార్

పిడుగురాళ్ల: ఆరోగ్యశ్రీ ట్రస్టును ప్రైవేటు ఇన్సూ్యరెన్స్ కంపెనీలకు అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఇటువంటి ప్రయత్నాలు మానుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్లలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్య శ్రీకి సంబంధించి ప్రైవేటు, కార్పొరేట్ వైద్యశాలలకు రూ.3500 కోట్ల బకాయిలు ఉన్నాయని, కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి బకాయిలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఇప్పుడు ఆరోగ్యశ్రీ ట్రస్టును ప్రైవేటు ఇన్సూ్యరెన్స్ కంపెనీలకు అప్పగించి వారికి అడ్వాన్స్‌లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధపడుతుందన్నారు. కార్పొరేటు వైద్యులు అడ్వాన్స్‌లు అడగటం లేదని, ముందుగా వైద్యం చేసి ఆ తర్వాత అడుగుతున్నారని, కానీ అవి ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారు.

నిర్వీర్యం చేసే కుట్ర

ఆరోగ్యశ్రీ ప్రదాత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ ద్వారా పల్లెలకు వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 2019 వరకు 1800 రోగాలకు ఆరోగ్యశ్రీలో చికిత్సలు అందించే పరిస్థితి ఉండేదని, 2019 తర్వాత మహానేత తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత 3 వేల రోగాలను ఆరోగ్యశ్రీలో చేర్చి మరింత బలోపేతం చేశారన్నారు. సంవత్సరానికి రూ.7500 కోట్లు ప్రైవేటు ఇన్సూ్యరెన్స్ కంపెనీలకు ముందస్తుగా ఇచ్చే కంటే రూ. 4 వేల కోట్లు ఆరోగ్యశ్రీ ట్రస్టుకి ఇస్తే మెరుగైన వైద్యం రాష్ట్రంలోని పేదలకు అందించే అవకాశం ఉంటుందన్నారు. ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేసే కుట్రను కూటమి ప్రభుత్వం చేస్తుందని ఆరోపించారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ



కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న స్పెషల్ కలెక్టర్ గాయత్రీదేవి, డిప్యూటీ కలెక్టర్ కుముదిని

- పీజీఆర్ఎస్‌కు 152 అర్జీలు
- స్వీకరించిన ప్రత్యేక కలెక్టర్ గాయత్రీదేవి, డిప్యూటీ కలెక్టర్ కుముదిని

నరసరావుపేట: స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రత్యేక కలెక్టర్ గాయత్రీదేవి, డిప్యూటీ కలెక్టర్ కుముదిని, ఏఓ లీలా సంజీవకుమారి ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారిచే 152 అర్జీలను స్వీకరించారు. వచ్చిన ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

పదేళ్ల నుంచి పింఛను కోసం తిరుగుతున్నాను..

నేను పుట్టుకతో దివ్యాంగురాలిని. నాకు వివాహమైంది. ముగ్గురు ఆడపిల్లలు పుట్టారు. భర్త చనిపోయాడు. సొంత ఇల్లులేదు, గజం స్థలం లేదు. నివాసం ఉండేందుకు ఇల్లులేక పట్టలతో గూడు ఏర్పాటుచేసుకొని ఉంటున్నా. 2014లో నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలలో నిర్వహించిన సదరస్ క్యాంపులో డాక్టర్లు నన్ను పరీక్షించి 73శాతం వికలాంగత్వం ఉన్నట్లుగా నిర్ధారిస్తూ సర్టిఫికేట్ ఇచ్చారు. ఆ సర్టిఫికేట్ ద్వారా దివ్యాంగ పింఛన్‌కోసం పలుమార్లు దరఖాస్తు చేశా. కలెక్టరేట్‌కు ఆరేడుసార్లు వచ్చా. ఇప్పటివరకు పింఛన్ మంజూరు చేయలేదు. దయచేసి ఇప్పటికైనా నాకు పింఛన్ మంజూరు చేయండి.

- ముద్దా అప్పమ్మ, పెదగార్లపాడు, దాచేపల్లి మండలం

పరిష్కరించకుండానే సంతకాలు చేయమంటున్నారు

స్థానిక సత్తెనపల్లి రోడ్డులోని ఆవులసత్రం పక్కనే ఉన్న కత్తవ కాలువను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని గతంలో కలెక్టర్‌కు అర్జీ ఇచ్చాం. దీనిపై ఆక్రమణలు తొలగించాలంటూ మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అయితే అధికారులు ఆక్రమణలు తొలగించకుండానే ఆ సమస్య పరిష్కారమైనట్లుగా సంతకాలు చేయాలంటూ మాపై ఒత్తిడి చేస్తున్నారు. ఇప్పటికైనా ఆక్రమణలు తొలగించి కత్తవ కాలువను కాపాడండి.

- పీడీఎం నాయకులు, నరసరావుపేట

మోసపోయాం.. న్యాయం చేయండి

- అదనపు ఎస్పీకి ఫిర్యాదుచేసిన బాధితులు
- పీజీఆర్ఎస్‌కు 88 ఫిర్యాదులు



జిల్లా అదనపు ఎస్పీ సంతోష్‌కు సమస్య వివరిస్తున్న బాధితులు

నరసరావుపేట: వివిధ రకాల కాయిన్ క్రిప్టో కరెన్సీ పేర్లతో తమను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకొని తమ డబ్బు తిరిగి ఇప్పించాలని పట్టణానికి చెందిన పలువురు బాధితులు జిల్లా ఎస్పీని కోరారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా అడ్మిన్ ఎస్పీ జేవీ సంతోష్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు జిల్లా నలుమూలల నుంచి హాజరైన బాధితులు కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలు, మోసం, చోరీల సమస్యలకు సంబంధించి 88 ఫిర్యాదులు అందజేశారు.

ఉద్యోగం ఇప్పిస్తామని రూ.2.50లక్షలు మోసం

విజయవాడలో నాగరాజు అనే వ్యక్తి ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లేస్‌మెంట్స్ నడుపుతున్నాడు. అతని దగ్గర పని చేసే లత ఇద్దరు కలిసి నాకు ఉద్యోగం ఇప్పిస్తామని మాయ మాటలు చెప్పి రూ.2.50లక్షలు తీసుకున్నారు. డబ్బులు అడుగుతున్నప్పటికీ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. విచారించి, న్యాయం చేయండి.

-వలేరు హనుమ, అచ్చంపేట

తక్కువ ధరకు బంగారం అంటూ మోసం

మాకు చేపూరి పూర్ణచంద్రరావు పరిచయమై తను నడికుడి ఎస్‌బీఐ బ్రాంచ్‌లో గోల్డ్ అప్రైజర్‌గా పని చేస్తున్నట్లు నమ్మబలికి బ్యాంకులో బంగారం వేలం వచ్చిందని, తక్కువ రేటుకు ఇప్పిస్తానంటూ మా వద్ద నుంచి చెరో రూ.2లక్షలు తీసుకున్నాడు. బంగారం గురించి అడిగితే వాయిదాలు వేస్తుండగా అనుమానం వచ్చి అతని గురించి విచారించామన్నారు. గతంలో నరసరావుపేటలో చీటీలు వేసి జనాన్ని మోసం చేసినట్లు, నడికుడి ఎస్‌బీఐ బ్యాంకులో ఉద్యోగం మానివేసినట్లు తెలిసింది. మోసం చేసిన పూర్ణచంద్రరావుపై చట్టపరంగా చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయండి.

- కొప్పుల ఉపేంద్ర, షేక్ హసన్‌వలి, కేసానుపల్లి, దాచేపల్లి మండలం

ఆస్తికోసం మద్యం తాగి వచ్చి తిడుతున్నాడు



నా మనవడు గణేష్ అతని భార్య జయలక్ష్మిలు ఆస్తి వారిపేరిట రాయమని ప్రతిరోజు అసభ్య పదజాలంతో తిడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మనవడు ప్రతిరోజూ మద్యం తాగి వచ్చి తిడుతున్నాడు. దీనిపై ఇప్పటికే గతనెల 13వ తేదీన పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాం. వారిపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. వారి నుంచి నాకు ప్రాణ రక్షణ కల్పించండి.

-ముక్తవరపు పిచ్చయ్య, పాతురు, నరసరావుపేట

క్రిప్టో కరెన్సీ పేరుతో రూ.40లక్షలు మోసం



హైదరాబాదు కేంద్రంగా పైతాన్ కాయిన్ క్రిప్టో రెన్స్ ఆన్‌లైన్ నెట్‌వర్క్ నిర్వహిస్తున్న నాగేశ్వర్‌కు ఏజెంట్ రవికుమార్ మాటలు విని రూ.40లక్షలు పెట్టుబడి పెట్టాం. సంస్థను ఈగల్ కాయిన్ క్రిప్టో కరెన్సీ నెట్‌వర్క్‌గా పేరు మార్చారు. మాకు అధిక లాభాలు వస్తాయని నమ్మించారు. ఇప్పుడు డబ్బులు అడుగుతుంటే ఇవ్వకుండా సాకులు చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారు. మమ్మల్ని మోసం చేసిన వారిపై చర్యలు తీసుకొని మా డబ్బులు ఇప్పించాలని మనవిచేస్తున్నాం.

- జి.వెంకటేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, సతీష్, బాలశ్రీనివాస్ తదితరులు

మమ్మల్ని కొట్టి మాపైనే తప్పుడు కేసు



మేము వ్యవసాయ పనులకు వెళ్లిన సమయంలో మా ట్రాక్టర్‌ను ఉద్దేశపూర్వకంగా కొర్రా లక్ష్మణనాయక్ తన ట్రాక్టర్‌తో ఢీకొట్టాడు. గాయాలైన మేము గతేడాది సెప్టెంబరు 10న స్థానిక పోలీసులకు ఫిర్యాదుచేశాం. దీంతో నాయక్, అతనికి చెందిన పదిమంది మాపై దాడిచేసి మమ్మల్ని తరిమివేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదుచేసినా ఎటువంటి చర్యలు తీసుకోకుండా నిందితుల ఫిర్యాదుతీసుకొని మాపై తప్పుడు కేసు నమోదుచేశారు. నకరికల్లు పోలీసులను పదే పదే కలవగా మా ఫిర్యాదును అప్పుడు కేసుగా ఫైల్‌చేశారు. దీనివల్ల మాకు తీరని అన్యాయం జరిగింది. ఈ రెండు ఎఫ్ఐఆర్‌లపై సమగ్ర విచారణ చేసి న్యాయం చేయండి.

- మూడావత్ లఘుపతినాయక్, లలిత్‌బాయ్, శివాపురం తండా, నకరికల్లు

నాటికలు పరిషత్‌లకే పరిమితం కాకూడదు



ముగింపు సభలో మాట్లాడుతున్న అజయ్ ఘోష్, వేదికపై ఇతర అతిథులు

- సినీ నటుడు అజయ్‌ఘోష్
- యడ్లపాడులో నాటకోత్సవాల ముగింపు సభ

యడ్లపాడు: నాటికలు కేవలం పరిషత్ ప్రదర్శనలకే పరిమితం కాకూడదని, క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి ప్రజాచైతన్యానికి పాటు పడేలా చేయాలని సినీనటుడు అజయ్‌ఘోష్ చెప్పారు. పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం ఆధ్వర్యంలో మూడు రోజులు నిర్వహించిన 22వ జాతీయస్థాయి పోటీల ముగింపు సభలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సామాజిక రుగ్మతలపై మరిన్ని నాటికలు రచించి, గ్రామాల్లో ప్రదర్శించాలని కోరారు. ఇక్కడి నాటికల పోటీల నిర్వహణ, నిబద్ధత, వాటి ఆదరణ తీరు తెలుగురాష్ట్రాల్లోని అనేక ప్రాంతాలకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ విషయంలో డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు అభినందనీయుడన్నారు. ఏటా పోటీల సమయంలో యడ్లపాడు వస్తానని, తనకు ఓ నాటిక వేసే అవకాశం ఇవ్వాలని కమిటీని కోరారు. దేశాన్ని కాపాడేందుకు కమ్యూనిస్టు పార్టీలన్నీ ఏకం కావాలని ఒకరితో అంటే నీకు అడిగే అర్హత ఉందా అంటూ తనను ప్రశ్నించారని, ఓ అభిమానిగా ధైర్యంగా ప్రశ్నించే హక్కు ఆ ఎర్రజెండానే ఇచ్చిందని వేదిక ద్వారా స్పష్టం చేశారు. నేటి యువత కమ్యూనిస్టు పోరాట యోధుడు సుందరయ్య గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

ప్రజల దుస్థితిపై నాటకాలు రావాలి..

మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడుస్తున్నా రాష్ట్రంలో పేదరికం, కనీస అవసరాలు, తాగునీరు అందని అవస్థలు, కిడ్నీలు అమ్ముకునే దుస్థితిపై స్పందించి రచయితలు నాటకాలు రాయాలని కోరారు. తెలుగురాష్ట్రాల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే అత్యధిక నాటక పరిషత్‌లు వెలుగొందుతున్నాయని తెలిపారు. తెలంగాణ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ టీవీ, సినిమా, ఓటీటీల ప్రభావం అత్యధికంగా ఉన్నా నాటక రంగాన్ని దాతలు, పరిషత్ నిర్వాహకులు, ముఖ్యంగా ప్రజలు బతికిస్తున్నారన్నారు. ఏఎన్‌యూ వైస్ చాన్స్‌లర్ కె.గంగాధరరావు మాట్లాడుతూ నాటకరంగానికి ఇంతటి ఆదరణ ఉందన్న విషయాన్ని తాను తొలిసారి చూశానని తెలిపారు. హార్వెస్ట్ విద్యాసంస్థల అధినేత పోపూరి రవిమారుతీ, సినీనటుడు నాయుడుగోపీ, వేదిక కార్యదర్శి జేవీ మోహన్‌రావు మాట్లాడిన వారిలో ఉన్నారు.